RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 358 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం ఆదివారం, 30 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-

## మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కన్ను మూత

### ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన జన నేత రాథోడ్ - అస్వస్థతకుగురై ఆకస్మికంగా మృతి



**ఉట్నూర్ జూన్ 29(ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కన్నుమూశారు. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. శనివా రం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆయన తుదిశ్వా స విడిచారు. ఆదివారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన ఆకస్మిక మరణం జిల్లా వాసులను కలిచివేసింది. అయన పార్దివదేహానికి నివాళ్లు అర్పించడానికి జిల్లా నాలుమూలల నుంచి అయన అభిమానులు, రాజకీయ నాయకులు ఉట్నూర్ లోని అయన ఇంటికి చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాథోడ్ రమేష్ రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీ నుంచి 1999 లో ఖానాపూర్ ఎమ్మెల్యే గా ఎన్నికైన అయన ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు. స్థానిక ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి జడ్పీటీసీ ఎన్నికై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి చేపట్టారు. 2009 లో ఆదిలాబాద్ ఎంపీగా రాథోడ్ రమేశ్ ఎన్నికయ్యారు. జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్రవేశారు. ప్రజల మనిషిగా గుర్తింపు తెచుకొన్నారు. తెలుగుదేశం పార్టీలో పొలిట్ బ్యూరో సభ్యుడిగా కూడా వ్యవహారించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్?లో చేరారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓటమి చెందారు. తర్వాత బీజేపీలో చేరి మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ టిక్కెట్ కోసం యత్నించగా, చివరి నిమిషంలో బీజేపీ అధిష్ఠానం బీఆర్ఎస్‌నుంచి వచ్చిన గోడం నగేశ్?కు ఇచ్చింది. అయినప్పటికీ ప్రజల్లోనే ఉంటూ ప్రజల మనిషిగా పేరొందిన రాథోడ్? రమేశ్‌చివరికి కాలేయ సంబంధమైన వ్యాధితో పోరాడలేక తుదిశ్వాస వదలటం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓ క్రియశీలక నాయకుడిని కోల్పోయినట్లయింది.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి –** ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమేశ్? కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజకీయాల్లో రమేశ్ ప్రత్యేక ముద్ర వేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రాథోడ్ రమేశ్ మృతిపట్ల కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు సంతాపం తెలిపారు. బీజేపీ నేత లక్ష్మణ్ కూడా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**రాథోడ్ రమేశ్ మృతి పట్ల ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు సంతాపం**

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మృతి పట్ల ఖానాపూర్ శాసనసభ్యులు సభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ సంతాపం తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు . జిల్లా పరిషత్ చైర్మన్?గా, శాసన సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవచేసారని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న రమేశ్ రాథోడ్ మరణం జిల్లాకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నా నని ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

## మాజీ పీసీసీ అధ్యక్షుడు డిఎస్ ఇక లేరు

### అనారోగ్యంతో కన్నుమూత
### నేడు అధికార లాంచనాలతో అంత్యక్రియలు
### అంత్యక్రియలకు హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి



**నిజామాబాద్ జూన్ 29(ప్రభాత సమాచారం)** మాజీ మంత్రి , రాజ్యసభ మాజీ సభ్యుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు డీఎస్ మృతిపట్ల సంతాపం తెలిపారు. మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. అంతిమయాత్రలో పాల్గొనేందుకు ఆదివారం నిజామాబాద్‌కు వెళ్లనున్నారు. డీఎస్ మరణం పట్ల సీఎం రేవంత్ సంతాపం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్, కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని కొనియాడారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని సీఎం రేవంత్ స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తు చేసుకున్నారు. డి.శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన రేవంత్ రెడ్డి, డీఎస్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

**పార్థీవ దేహంపై కాంగ్రెస్ జెండా.**

పీసీసీ మాజీ అధ్యక్షుడు డీ. శ్రీనివాస్ మృతి కాంగ్రెస్ పార్టీకి, బలహీన వర్గాలకు తీరని లోటని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్?బాబు పేర్కొన్నారు. డీఎస్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. డీఎస్ కుమారులు సంజయ్, అరవింద్‌లను పరామర్శించి, డీఎస్ చివరి కోరిక మేరకు ఆయనపై కాంగ్రెస్ జండా కప్పేందుకు అనుమతి తీసుకున్నారు. ఇద్దరు కుమారులు ఓకే అనడంతోపాటు ఆయన కాంగ్రెస్ మనిషేనని స్పష్టం చేయడంలో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న కాంగ్రెస్ జండాను కప్పారు.

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**


మాజీ మంత్రి, పీసీసీ మాజీ చీఫ్ డి.శ్రీనివాస్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికార లాంఛనాలకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. అంత్యక్రియల సమయం, స్థలంపై కుటుంబ సభ్యులతో చర్చించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ కలెక్టర్‌కు సీఎస్ సూచించారు.




## కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాలు జీహెచ్ఎంసీలో విలీనం.. !

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను ఎక్సైజ్ చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో విలీనం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారి ప్రకటించారు. డిఫెన్స్ సెక్రటరీ ఎ. గిరిధర్ నేతృత్వంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు సివిల్ ప్రాంతాలను కంటోన్మెంట్ల నుంచి మున్సిపల్ పరిధిలోకి మార్చే విధానాలపై చర్చించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని శాంతి కుమారి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బోర్డుల రద్దుకు కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. బ్రిటిష్ పాలన విధానాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్రాలను కోరింది. అయితే, విధివిధానాలను ఖరారు చేసే బాధ్యత కలిగిన కేంద్ర కమిటీ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతో ఇంకా పంచుకోలేదని శాంతి కుమారి పేర్కొన్నారు.

ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్రంతో తెలంగాణ సహకరిస్తుందని ఆమె హామీ ఇచ్చారు. విలీనంతో పరిపాలనా సామర్థ్యం, స్థానిక అభివృద్ధిని మెరుగుపరచడం పెరుగుతుందన్నారు. కంటోన్మెంట్ ఉండడంతో హైదరాబాద్, కరీంనగర్ రాజీవ్ రహదారి విస్తరణ ఇబ్బందిగా మారింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్రంతో మాట్లాడిన సీఎం రేవంత్ సమస్యను పరిష్కరించారు. మార్చి 7న రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం భూమి పూజ చేశారు. రాజీవ్ రహదారి ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్ అభివృద్ధి చెందడమే కాకుండా, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందని అప్పుడు సీఎం చెప్పారు. ఓఆర్ఆర్ నిర్మాణం, అంతర్జాతీయ విమానాశ్రయం, హైటెక్ సిటీ వంటి అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి హైదరాబాద్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.




సిద్దిపేట : రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులను సరైన పరిహారం అందుతుందాలేదా అన్న టెన్షన్ వెంటాడుతోంది. పరిహారాలకు సంబంధించి ఇదివరకే త్రీ డీ నోటిఫికేషన్ ను విడుదల చేసి.. నిర్వాసితులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. త్వరలో అవార్డు ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ట్రిపుల్‌ఆర్ కింద సేకరిస్తున్న భూములకు ఎకరానికి రూ. 6 లక్షల నుంచి 8 లక్షల వరకు పరిహారం ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోంది. విలువైన భూములు తీసుకుని నామమాత్రంగా పరిహారం ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో ట్రిపుల్ ఆర్ దాదాపు 32 కిలో మీటర్ల వరకు ఉంటోంది. దీనికోసం 962.27 ఎకరాలను సేకరించాలని నిర్ణయించిన అధికారులు మార్కింగ్ చేశారు. జగదేవ్ పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలీరాజనేట , మర్కుక్ మండలం అంగడి కిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్ పల్లి, సంగాపూర్, మక్త మాసాన్ పల్లి, బంగ్ల వెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో 1,168 మంది రైతుల నుంచి ఈ భూములను సేకరించనున్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వల్ల బ్రేక్ పడిన భూసేకరణ జూన్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

**త్వరలో అవార్డు ప్రకటన :** ట్రిపుల్‌ఆర్ కోసం సేకరిస్తున్న భూముల పరిహారానికి సంబంధించి

### అవార్డు ప్రకటనకు సిద్ధమవుతున్న అధికారులు
### ఎకరానికి 6 నుంచి 8 లక్షలు ఇస్తారని ప్రచారం
### తక్కువ పరిహారంతో నష్టపోతామని ఆందోళన

త్వరలో అధికారులు అవార్డు ప్రకటించ నున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా 'కాలా'(కాంపిటెంట్ అథార్టీ ఫర్ ల్యాండ్ అక్విజేషన్) లను నియమించి భూసేకరణ ప్రారంభిం చారు. భూ సేకరణకు సంబంధించి త్రీడీ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. రైతులతో నిర్వహించి మీటింగ్‌ల్లో భూసేకరణ, పరిహారాలకు సంబంధించి అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలయజేయాలని అధికారులు సూచించారు. దీంతో పరిహారాలకు సంబంధించి పలువురు అభ్యంతరాలను అందజేశారు.

**పెండింగ్ లో అలైన్‌మెంట్ మార్పు :** ట్రిపల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలన్న ప్రతిపాదన రాగా ఆ అంశం ఇప్పుడు పెండింగ్ లో పడిందని తెలుస్తోంది. భూసేకరణ దశలో అలైన్ మెంట్ మారిస్తే పనుల్లో జాప్యం జరుగుతుందని అధికారులు అంటున్నారు. కొంతకాలం కింద రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంటకరెడ్డి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు అంశాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పచ్చని పంటలు పండే విలువైన భూముల గుండా వెళ్తున్న రోడ్డు అలైన్‌మెంట్ మారితే తమకు ప్రయోజనం కలుగవచ్చునని రైతులు ఆశిస్తున్నారు.

నెల రోజుల కింద మర్కుక్ మండలానికి చెందిన నిర్వాసితులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలసి అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.

గజ్వేల్‌రింగ్‌రోడ్డుకు ట్రిపుల్ ఆర్ 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. నిబంధనల ప్రకారం రింగ్‌రోడ్డునుంచి మరో రింగ్‌రోడ్డు కనీసం 60 కిలో మీటర్ల దూరం ఉండాలి. ఈ అంశంపై ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది.





## డ్వాక్రా మహిళలకు శుభవార్త

### మహిళా స్వయం సహాయక సంఘాలకు 20 వేల కోట్ల రుణాలు

హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రారంభించాయి. అంతేకాక మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్‌ల ద్వారా మహిళలు ఆర్థిక సాయం పొందుతుంటారు. ఇక ఈ డ్వాక్రా మహిళలకు సంబంధించి ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకుంటాయి. ముఖ్యంగా వారికి అందించే రుణం విషయంలో ప్రభుత్వాలు పలు నిర్ణయాలు తీసుకుంటాయి. ఈ క్రమంలో కొన్ని నిర్ణయాలు మహిళలకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్వాక్రా మహిళకు గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 20 వేల కోట్ల రుణాలు అందించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. తెలంగాణలో డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్ చెప్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇది చాలా సానుకూల అంశం అని చెప్పుకోవచ్చు. ఈ ఏడాది 20 వేల కోట్ల రుణాలు అందించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికను సీతక్క శనివారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. ఒకప్పుడు డ్వాక్రా గ్రూప్ వారికి రూ. 10 వేల రుణం ఇవ్వాలంటే బ్యాంకులు భయపడేవని ఆమె తెలిపారు. కానీ ఇప్పుడు రూ. 20 లక్షల వరకు రుణాలు మహిళా సంఘాలకు అందుతుని మంత్రి వెల్లడించారు. ఈ సంఘాలతో మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, ఐక్యతను అభివృద్ధిని సాధిస్తున్నమని సీతక్క తెలిపారు. పేదలకు ప్రభుత్వమే అండగా ఉండి అభివృద్ధి పథాన నడిపించాలనేదే తమ సంకల్పమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో డ్వాక్రా గ్రూప్ లో ఇంకా బల పడాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాలకే బ్యాంకర్లు వెళ్లి మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. మహిళల్లో తమ అవసరాలు తీరుస్తారనే విశ్వాసాన్ని బ్యాంకులు కల్పించాలని ఆమె తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. అందులో భాగంగా మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచే కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ తయారీ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. డ్వాక్రా గ్రూప్ లోని సభ్యులకు జీవిత భీమా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలు కొత్త ఉ పాధి అవకా శాలు చెప్పండి, బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదే ఆమె తెలిపారు. మొత్తంగా డ్వాక్రా సంఘాలకు రుణం పెంచుతూ..తెలంగాణ సర్కార్ శుభవార్తను అందించింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అప్పుడు రాముడు.. ఇప్పుడు పాలస్తీనా.. ఒవైసీ చుట్టూ వివాదాలు!

ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ.. అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలంటూ.. ఉత్తరాదికి చెందిన రెండు మూడు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వీటిలో బీజేపీ సభ్యులు కూడా ఉండడం గమనార్హం. తాజాగా బీజేపీ నాయకురాలు.. నవనీత్ రాణా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఒవైసీ ఎంపీ సభ్యత్వాన్నిరద్దు చేయాలని కోరుతూ.. ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాయడం సంచలనంగా మారింది. అదేవిధంగా యూపీకి చెందిన మరో ఎంపీ కూడా.. దీనికి మద్దతు ఇచ్చారు. పార్లమెంటులో ఇటీవల ఎంపీగా ప్రమాణం చేసిన అసదుద్దీన్ ఒవైసీ.. ప్రమాణ పత్రం చదువుతూ.. చివరి లో –జై పాలస్తానా–.. జై తెలంగాణ.. అంటూ.. తన ప్రమాణాన్ని ముగించారు. అయితే.. పాలస్తీనా వ్యాఖ్యల పై అప్పట్లోనే బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఆయనను సభలోకి అడుగు పెట్టనివ్వద్దంటూ.. కొందరు వ్యాఖ్యానించారు. మరికొందరు.. ఆయనపై అనర్హత వేటు వేసి.. పాలస్తీనాకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం ఇప్పుడు ముసురుకుని.. రాష్ట్రపతి వరకు చేరింది. ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. అయితే.. అసదుద్దీన్ వ్యాఖ్యలు ఇప్పుడు మాత్రమే కొత్తకాదు. గతంలోనూ ఆయన అయోధ్య రామాలయం పైనా.. రామసేతు(తమిళనాడు) పైనా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు ఎవరికి పుట్టాడో ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. రామసేతును శాస్త్రవేత్తలు నిరూపించలేదని.. అప్పటి నాయకులు ఒత్తిడి తెచ్చి.. నిరూపించుకున్నారని వ్యాఖ్యానించారు. అయోధ్య రామమందిరం.. రాముడి కోసం.. నిర్మించలేదన్న ఆయన.. రాజకీయం కోసం నిర్మించారని.. ఇక, మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే.. రామమందిరం రాజకీయ కేంద్రం అవుతుందన్నారు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లోనూ వివాదం రాజుకుంది. అసదుద్దీన్‌నుదేశం నుంచి వెలివేయాలంటూ.. యూపీ లోని బీజేపీ ఎంపీలు.. ప్రధాని 2021లో రిప్రజెంటేషన్ ఇచ్చారు. అయితే.. ఈ విషయాన్ని తర్వాత కాలంలో అందరూ మరిచిపోయారు. ఇక, ఇప్పుడు జై పాలస్తీనా నినాదాలు చేయడంతో మరో సారి.. ఒవైసీపీ వివాదాలకు కేంద్రంగా మారారనే చర్చ సాగుతోంది. ఈ విషయంపై రాష్ట్రపతి ఆయనను వివరణ కోరే అవకాశం ఉంది. అంతేకానీ.. సభ్యత్వాన్ని రద్దు చేయక పోవచ్చు.

# ముఖం చాటేసిన వర్షాలు.. ముందుకు సాగని పనులు



ఎల్లారెడ్డిపేట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊరటనివ్వ లేదు. వరుణదేవుడు ముఖం చాటేయడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భూగర్భజల మట్టాలు సైతం లోతుకు పడిపోతుండటం, బోరుబావుల నుంచి నీటి ధార తగ్గిపోతుండటంతో పంటల సాగు సందిగ్ధంలో పడిపోయింది. అప్పుడప్పుడు పడుతున్న చిరుజల్లులు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, ఇతర అపరాల పంటలకు ప్రాణం పోస్తున్నా ప్రధానంగా వరికి శరాఘాతంగా మారింది. వరి పంట కోసం నార్లు పోసిన రైతులు భారీ వర్షాల కోసం ఆశతో నింగిలోకి తొంగి చూస్తున్నారు. కొన్ని చోట్ల పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటల్లో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. సమృద్ధిగా వర్షాలు లేక కర్షకుల్లో ఆశలు తగ్గిపోతున్నాయి.

2.35 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో రైతులు బావులు, బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఈ వానాకాలంలో మొత్తం 2,35,866 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 1,83,080 ఎకరాల్లో, కంది 1,502, మొక్కజొన్న 1,510, పత్తి 49,215, సోయాబీన్ 5, మిరప 180, పెసర 348, మినుము 10, జొన్న 10, ఆముదం 6 ఎకరాల్లో సాగుకానున్నాయని అంచనా వేశారు. వర్షపాతం అంతంత మాత్రమే నమోదు కావడంతో చెరువులు, కుంటల్లోకి కొత్తగా వరద వచ్చి చేరలేదు. దీంతో బావులు, బోరుబావులు రీఛార్జ్ కాలేదు. బోరుబావుల్లో నుంచి నీటి ధార క్రమంగా తగ్గిపోతుండటంతో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 26 వరకు జిల్లాలో వరి 20 ఎకరాల్లో, మొక్కజొన్న 438, కంది 58, పెసర 15, పత్తి 31,300 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ఈ నెల 26 వరకు 108.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 97.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. 11 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది.

పాతాళంలో గంగ...

ఈ ఏడాది అయినా సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండించాలని భావించిన మెట్టప్రాంత రైతులు పాతాళగంగ పైకి రాకపోవడంతో బెంగ పెట్టుకున్నారు. బోరుబావులు వట్టిపోయే దశకు చేరుతున్నాయి. వర్షాకాలం సీజన్ నుంచి నేటి వరకు కురిసిన జల్లులు ఏ మాత్రం ప్రభావం చూపలేదు. సాగునీరు మృగ్యమై పంటలు వేసే ప్రక్రియ ఊగిసలాట నడుమ కొనసాగుతోంది. భూగర్భ జల మట్టాలు వందల మీటర్ల లోతులోకి దిగజారిపోవడం వల్ల నిరంతరంగా కరెంటున్నా నీరు రావడం లేదని వాపోతున్నారు. పంటలు సాగు చేయాలా? వద్దా అనే ఆలోచనలో పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. 2023 నవంబరుకు, ఈ సంవత్సరం మే మాసంతో పోల్చితే 5.7 మీటర్ల లోతుకు భూగర్భజల మట్టాలు పడిపోయాయి. అలాగే గతేడాది మే నెలకు, ఈ ఏడాది మే నెలకు పోల్చితే 2.28 మీటర్ల లోతుకు వెళ్లాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి మే వరకు 1.07 మీటర్ల స్వల్ప వృద్ధి కనిపిస్తున్నా నీటి తోడకం ఎక్కువవుతుండటంతో భూగర్భజల మట్టాలు మళ్లీ దిగజారిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. బోయినపల్లి మండలంలో తక్కువ లోతులో సగటున 6.12 మీటర్లలో ఉండగా, వేములవాడ అర్బన్‌లో అత్యధిక లోతులో 17.42 మీటర్లలో భూగర్భజలాలు లభిస్తున్నాయి.

జులై 15 వరకు వరి, పత్తి సాగుకు అవకాశం

సాధారణంగా జూన్ 21 తర్వాత పంటల సాగు ఊపందుకుంటుంది. జులై 15 వరకు పత్తి, మొక్కజొన్న, కంది, మినుము పంటలు సాగు చేసే అవకాశముంది. 50 నుంచి 60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత పత్తి విత్తనాలు విత్తితే మొలకశాతం ఎక్కువగా ఉంటుంది. జులై 15 వరకు నార్లు పోసుకోవచ్చు. అలాగే ఆగస్టు మొదటి వారం వరకు వరినాట్లు వేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వరి నారు యాజమాన్యంలో మొగిపురుగును తట్టుకోవడానికి నార్లు తీసే వారం రోజుల ముందు ఎకరానికి సరిపడే నారుకు కిలో కార్బోఫ్యూరాన్ గుళికలు గానీ, కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ గుళికలను చల్లుకోవాలి.

భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# పర్యావరణ పరిరక్షణ.. అత్యున్నత శిక్షణ



ములుగు: ఉన్నత విద్యా ప్రమాణాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని స్థాయిల్లో అటవీ శాఖ అధికారులను అందించాలన్న సంకల్పంతో వెలిసింది సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రం. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అటవీ నిర్వహణను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అటవీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2016లో అటవీ విద్యకు సంబంధించి బీఎస్సీ కోర్సును ప్రారంభించారు. మొదట్లో హైదరాబాద్ కొంపల్లి సమీపంలోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో కళాశాల ఏర్పాటు చేశారు. 2018లో సిద్దిపేట జిల్లా ములుగులో సొంత భవనాలను నిర్మించి నాటి సీఎం చేతుల మీదుగా కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వసతిగృహాలు

అటవీ కళాశాల పరిశోధన కేంద్రానికి సంబంధించిన భవనాలను రూ. 72 కోట్లతో నిర్మించారు. అధునాతన సౌకర్యాలతో కూడిన తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలను ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, సిబ్బందికి ప్రత్యేకంగా వసతిగృహాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కళాశాల పరిశోధనా కేంద్రానికి 52 హెక్టార్ల అటవీ భూములను కేటాయించారు. ఆట మైదానం అందుబాటులో ఉంది. మొక్కలు పెంచి పరిశోధన చేసే అవకాశం కల్పించారు.

వివిధ అంశాలపై తర్ఫీదు

అటవీ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా తేనెటీగల పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ, నర్సరీల ఏర్పాటు, వుడ్ వర్క్‌షాపోపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. బోధనలో భాగంగా విద్యార్థులను దేశంలోని పలు ప్రాంతాలకు క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తున్నారు. కేంద్రంలోని నర్సరీలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఆటల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామం, యోగా వంటివి నిత్యం తప్పనిసరి. పోటీ పరీక్షలు రాసేందుకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటరునూ ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో చదువుతో పాటు వివిధ విభాగాల్లో రాణించిన పలువురు విద్యార్థులు గవర్నర్ రాధాకృష్ణన్ నుంచి బంగారు పతకాలు అందుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా అధునాతన సౌకర్యాలతో కూడిన కళాశాల పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వం ములుగులో ఏర్పాటు చేసింది. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిత ఖాయం. ఇక్కడి అవకాశాలను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలి.
ఆశ, కళాశాల పరిశోధన కేంద్రం డీన్

కోర్సుల వివరాలు..

బీఎస్సీలో ఏటా 65 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. ఎమ్మెస్సీలో 20 మంది చేరేందుకు అవకాశం ఉంది. పీహెచ్‌డీలో అయిదు నుంచి పది మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇప్పటివరకు కళాశాల నుంచి అటవీ శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసిన 250 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. వీరిలో కొందరు ఉద్యోగాలు సాధించగా, మరికొందరు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన 40 మంది ఇక్కడి నుంచి బయటకు వెళ్లారు. పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలు కొనసాగుతున్నాయి.

దరఖాస్తు ఇలా..ప్రస్తుతం కళాశాల పరిశోధన కేంద్రంలో బీఎస్సీ అటవీ శాస్త్రానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ర్యాంకుల ఆధారంగా 50 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. పేమెంట్ ఆధారంగా 10 మంది, ఈడబ్ల్యూఎస్ ద్వారా మరో ఐదుగురికి ప్రవేశం కల్పిస్తారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేయడానికి గడువుంది.

## కంటోన్మెంట్ విలీనంపై ముందడుగు

హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని సివీలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే విషయమై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విలీన అంశానికి సంబంధించిన విధివిధానాలపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ ఈనెల 25న తెలంగాణ చీఫ్ కార్యదర్శి శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. బ్రిటిష్ పాలన నుంచి నేటివరకు దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, విలీన ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విలీనానికి సిద్ధంగా ఉన్నట్లు సమ్మతిని తెలిపిందని, విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు పట్టుదలతో ఉందని శాంతికుమారి పేర్కొన్నట్లు సచివాలయ అధికారులు జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించలేదని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పనిచేస్తుందని శాంతికుమారి వెల్లడించినట్లు అధికారులు వివరించారు.

## పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను దరఖాస్తులను పరిష్కరించాలి

### సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



**ఆదిలాబాద్ జూన్ 29(ప్రభాత సమాచారం)**
ధరణి లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సిసిఎల్ఏ కార్యాలయం నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా పాలనాధికారి రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని తహసీల్దార్ ,రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని మాడ్యు ల్స్ లో దాఖలైన దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేసి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారం లోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డిఓ వినోద్ కుమార్,తహసీల్దార్ సంపత్, కలెక్టరేట్ సూపరెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు

## మాజీ రాథోడ్ రమేష్ మృతి పట్ల సంతాపం


**నిర్మల్ జూన్ 29(ప్రభాత సమాచారం)**
మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతి పట్ల నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మల్లా రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రాథోడ్ రమేష్ సుదీర్ఘ రాజకీయ జీవితంలో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మెన్ గా,ఎంపీగా, ఖానాపూర్ ఎమ్మెల్యే గా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారనిఅన్నారు ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కొత్త సిఐ ను కలిసిన ముస్లిం ఏక్తా సంఘం సభ్యులు



**నిర్మల్ జూన్ 29(ప్రభాత సమాచారం)**
నిర్మల్ కు కొత్తగా వచ్చిన సి.ఐ. ప్రవీణ్ కుమార్ ను తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం సభ్యులు కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గాజుల్పేట్ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా తెలంగాణ ముస్లిం సంఘం అధ్యక్షులు షేక్ ముజాహిద్ , ఉపాధ్యక్షులు సాజీద్, జాయింట్ సెక్రెటరీ జుబేర్, నిర్మల్ మండల్ అధ్యక్షులు అమాన్, అజహర్, ఇమ్రాన్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## రాథోడ్ రమేష్ మృతి పట్ల హరియాణా గవర్నర్ సంతాపం



**ఆదిలాబాద్ జూన్ 29(ప్రభాత సమాచారం)**
మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. రమేష్ రాథోడ్ మరణ వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, పార్లమెంట్ ఎన్నికల ముందే అయన చండీగఢ్ కు వచ్చి తన ఆశీర్వాదం తీసుకొని, దేశం కోసం బలంగా పనిచేస్తానని తనకు తెలిపారని, అప్పుడు తాను మీరు బాగా చిక్కిపోయారు, ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలని వారికి హితవు చెప్పినట్లు, దానికి సమాధానంగా తాను ఆరోగ్యంగానే ఉన్నానని సమాధానమిచ్చారని దత్తాత్రేయ గారు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లానుండి జిల్లా పరిషద్ చైర్మన్ గా, శాసనసభ్యునిగా,పార్లమెంట్ సభ్యునిగా ఎన్నుకోబడిన రమేష్ రాథోడ్ ఆదిలాబాద్ జిల్లాకోసమే గాకుండా బంజారాల అభివృద్ధికోసం విశేషంగా కృషిచేశారని, వారు తనకు ఆత్మీయ మిత్రులని, వారి మరణంతో ఒక ఆత్మీయ బంధువుని కోల్పోయానని భావిస్తున్నానని, వారి మృతి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాలకే కాకుండా బంజారా సమాజానికి తీరని లోటు అని దత్తాత్రేయ పేర్కొన్నారు. రమేష్ రాథోడ్ మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని, ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

# ఇంకెన్నాళ్లు..?

హైదరాబాద్ : రాజధానిలో లక్షలాది మంది ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత పదేళ్లలో ప్రభుత్వం 65 వేల మంది పేదలకు మాత్రమే గృహాలను అందించగలిగింది. ఈ నేపథ్యంలోనే మియాపూర్‌లో ప్రభుత్వ అధీనంలోని భూములను దాదాపు పది వేల మంది నగర వాసులు బలవంతంగా ఆక్రమించడానికి ప్రయత్నించారు. సుమారు వెయ్యి మంది పోలీసులు రంగంలోకి దిగితేనేకానీ పరిస్థితి అదుపులోకి రాలేదు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు నిర్మించుకోవడానికి పేదలు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు.

వినిపించని ఊసు..ఇళ్ల పంపిణీ విషయంలో పేదల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నా.. కొత్తవి అటుంచి.. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లనైనా పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయడం లేదు. నగర జనాభా దాదాపు కోటికి దగ్గరైంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి రాజధానిలో ఇళ్ల నిర్మాణాల విషయంలో నాటి ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. భారాస ప్రభుత్వ హయాంలో సుమారు 15 లక్షల మంది దరఖాస్తు చేశారు. దీనిపై విచారణ చేస్తే 10 లక్షల మంది వరకు అర్హులని తేలింది. మహానగరంతోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో లక్షల ఇళ్ల నిర్మాణాన్ని మొదలు పెట్టింది. దీనికి దాదాపు 9714.59 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో కొంత భరించడానికి కేంద్రం కూడా ముందుకు వచ్చింది.



ఇందిరమ్మ పథకం ఎప్పుడో..?

ఎన్నికల వాగ్దానంలో భాగంగా స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. నగరంలో దాదాపు 5 లక్షల మంది స్థలం ఉన్న అర్హులు ఉంటారని అధికారుల అంచనా. ఈ పథకం కింద నిర్మాణం జరిగినా నగరంలో ఇళ్ల సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక ఇంకా మొదలుపెట్టలేదు. దీనిపై పూర్తిస్థాయి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు కూడా దీనిపై దృష్టిసారించలేదు.

నిర్మాణంలో 35 వేల గృహాలు

గత పదేళ్లలో 65 వేల ఇళ్లను మాత్రమే నిర్మించారు. ఎన్నికలకు ముందు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. తాగునీరు, రోడ్లు ఇతరత్రా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అవి ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 35 వేల ఇళ్లు చాలావరకు చివరి దశలో ఉన్నాయి. మరో రూ.3 వేల కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తే.. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తికావడంతో పాటు ఇప్పటికే ఇచ్చిన సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రభుత్వం ఇప్పటివరకు రెండు పడక గదుల నిర్మాణంపై సమీక్ష చేయలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు కూడా ఏడాదిన్నర క్రితమే పనులు ఆపేశారు.

భారీగా పెరిగిన అద్దెలు గత రెండేళ్లలో నగరంలో ఇళ్ల అద్దెలు దాదాపు 35 శాతం పెరిగాయి. కాలనీల్లో సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు తీసుకోవాలంటే అద్దె రూ.10 వేల పైమాటే. అదే డబుల్ బెడ్ రూం కావాలంటే కనీసం రూ.15 వేలు భరించాల్సిందే. మురికివాడల్లోనూ అద్దెలు విపరీతంగా పెంచారు. ఈ నేపథ్యంలో మియాపూర్‌లోని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలంలో ఇళ్ల నిర్మాణానికి తరలిరావాలని స్థానికులు కొంతమంది పిలుపునివ్వడంతో ఒక్కసారిగా సుమారు పది వేల మంది ఈ ప్రాంతానికి చొచ్చుకువచ్చారు. ఎన్నికల ముందు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకోవడానికి యత్నించారు. నగర పరిధిలో మరోసారి ఇటువంటి కార్యక్రమం చేపట్టాలని రెండు పార్టీలు భావిస్తున్నాయి.

## నిధుల లేమితో తప్పని అవస్థలు

కరీంనగర్ :కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్లే బైపాస్ రోడ్డు. ఈ రహదారిపై దాదాపు 12 చోట్ల భారీ గుంతలు ఉన్నాయి. వీటిని ఇప్పటికిప్పుడు మరమ్మతు చేయాల్సి ఉన్నా నిధుల లేమి వేధిస్తోంది. నిత్యం దాదాపు 5 వేల నుంచి 6 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని వీలైనంత త్వరగా మరమ్మతు చేయించకపోతే త్వరలో పడే వర్షాలకు ఈ దారి మరింత ధ్వంసమయ్యే అవకాశముంది.సుల్తానాబాద్ నుంచి కాల్వ శ్రీరాంపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి. రోజూ వందలాది ఇసుక లారీలు, ఇతర వాహనాలు వెళ్తుండటంతో ధ్వంసమైంది. గతంలో ఈ మార్గంలోని గుంతలను పూడ్చేందుకు, ఇతర నిర్మాణ పనుల కోసం రూ.5 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలోని ఈ మార్గాన్ని వీలైనంత తొందరగా మరమ్మతు చేస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలో భారీ వరదల కారణంగా రోడ్లు, కల్వర్టులు పెద్ద మొత్తంలో ధ్వంసమయ్యాయి. పంచాయతీరాజ్ (పీఆర్) విభాగం పరిధి రోడ్లు కోతలకు గురయ్యాయి. రహదారులు భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖ పరిధిలోని మార్గాలకు నష్టం వాటిల్లింది. అప్పట్లోనే అధికారులు నష్టాన్ని అంచనా వేసి అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన వాటికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఆర్ విభాగం పరిధిలో 173.70 కి.మీ.ల రోడ్లు దెబ్బతిన్నాయని.. ఇందుకోసం రూ.188 కోట్లు అత్యవసరంగా మంజూరు చేయాలని నివేదికను అందించారు. కొన్ని పనులకు మాత్రమే నిధులు విడుదలవగా.. మిగతా పనులకు మోక్షం లభించలేదు. అక్కడక్కడా ఎమ్మెల్యేల చొరవతో తాత్కాలిక పనులు చేపట్టడంతో 20శాతం మేర నష్ట నివారణ చర్యలు పూర్తయ్యాయి. మిగతా చోట్ల ఎక్కడి పరిస్థితి అక్కడే అన్నట్లు ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో దాదాపుగా 80 కి.మీ.లకుపైగా రోడ్లు పాడవగా.. ఇందుకు రూ.100 కోట్లు అవసరమని తేల్చినా.. ఇంకా మరమ్మతులు లేవు.తక్షణం చేపట్టాల్సినవి..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో తక్షణం మరమ్మతులు చేయాల్సిన రోడ్ల వివరాలు సేకరించింది. ఇలా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో ఇప్పటికిప్పుడు 500 కి.మీ.ల రోడ్లను బాగు చేయాలని ఇందుకోసం రూ.199 కోట్లు అవసరమని లెక్క తేల్చింది. కరీంనగర్ సర్కిల్‌లో 200 కి.మీ.ల మార్గానికి రూ.99 కోట్లు, జగిత్యాల సర్కిల్‌కు 300 కి.మీ.ల దారి బాగుకు రూ.109 కోట్లు అవసరమని అంచనాలు సిద్ధం చేశారు. త్వరలో వీటికి నిధులు విడుదల చేసేందుకు జీవోని సిద్ధం చేస్తున్నారు. పీఆర్ విభాగంలోనూ ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 600 కి.మీ.ల మేర మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటి కోసం దాదాపుగా రూ.200 కోట్లకుపైగా నిధులవసరమని సంబంధిత విభాగం అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టినా వానలు వస్తే తారు చెదిరిపోయే పరిస్థితి ఎదురవుతుందని పేర్కొంటున్నారు.

పనులకు టెం‘డర్’!పరిశీలనలు, అంచనాలు, ప్రతిపాదనలతోనే ఆలస్యం జరుగుతుంటే.. ఇక పనులను చేపట్టే టెండర్ల విషయంలోనూ విపరీతమైన జాప్యం జరుగుతోంది. కొన్ని చోట్ల గుత్తేదారులు బిల్లులు సక్రమంగా రావడం లేదనే కారణంతో పనులను చేపట్టడానికే జంకుతున్నారు. లేదా ఒక్క గుత్తేదారే అయిదారు చోట్ల పనులను చేపడుతుండటం వల్లా జాప్యం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరం చివరినాటికే దాదాపుగా రోడ్లకు సంబంధించి 210 టెండర్లను పిలిస్తే అందులో 168 పనులకే గుత్తేదారులు ఆసక్తి చూపించారు. అప్పటికే దెబ్బతిన్న 506 కి.మీ.ల మార్గానికి రూ.192 కోట్లతో పనులు చేపట్టాలని భావించారు. ఇందులో బీటీఆర్ (బ్లాక్ టాప్ రోడ్డు), ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రోడ్డు)లున్నాయి. ప్రతి ఆర్థిక సంవత్సరం నిర్ణీత వ్యవధిలో నిధులు రావడం లేదు.. ఒకవేళ వచ్చినా సకాలంలో టెండర్లు జరగడం లేదు.

# మద్యం మత్తు.. వదిలించేదెప్పుడు?



తాండూరు : జిల్లాలో గ్రామాలు..పట్టణాలు తేడా లేకుండా యువత మొదలు వృద్ధుల వరకు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. ప్రధానంగా యువత పుట్టినరోజులు, పండుగలు, శుభకార్యాల సమయంలో సంతోషం, సరదా పేరుతో మద్యం సేవిస్తున్నారు.క్రమంగా అలవాటుగా మారి బానిసలుగా మారుతున్నారు. వీరిని మద్యం మత్తు నుంచి విడిపించేందుకు ‘డీ అడిక్షన్’ (పునరావాస) కేంద్రం ఉన్నా నిరుపయోగంగా మారింది. నిర్వాహకులు ఎలాంటిచర్యలు తీసుకోవడంలేదని విమర్శలొస్తున్నాయి. దీనికి సంబంధించి కథనం.

బాధితుల్లో కూలీలు, కార్మికులే ఎక్కువ : తాండూరు ప్రాంతంలో అత్యధికంగా ఉన్న సిమెంటు, నాపరాయి పరిశ్రమల్లో దాదాపు 20,000 మందికి పైగా కారికులు, కూలీలు పనిచేస్తున్నారు. కూలినాలీ చేసి అలసిపోయిన ఉదయం, సాయంత్రం, రాత్రి ఇలా ప్రతిరోజు రెండు మూడు పూటలా మద్యం తాగుతున్నారు. చెమటోడ్చి సంపాదించిన సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. వెరసి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ కలహాలు పెరిగిపోతున్నాయి.

మద్యం మాన్పించేందుకు..

మద్యం మాన్పించి జీవితాలను గాడిన పెట్టేందుకు కేంద్ర సర్కారు ద్వారా జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రాన్ని తాండూరులో ఏళ్ల క్రితమే నెలకొల్పారు. కానీ మొక్కుబడిగా కొనసాగిస్తున్నారు. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. మద్యం మాన్పించేందుకు వచ్చే వారిని కేంద్రంలో ఉంచి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వ్యాయామం, ఆహారపు అలవాట్లతో మార్పు, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. నాలుగైదు వారాలపాటు కేంద్రంలోనే ఉంచి మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం, తేనీరు వంటివి అందించాల్సి ఉంది. కానీ అమలుకు నోచుకోకపోవడంతో కేంద్రం లక్ష్యం నెరవేరడం లేదు. ఇదే విషయమై కేంద్రం నిర్వాహకులు త్యాగరాజు మాట్లాడుతూ..కేంద్రం కొనసాగించేందుకు సకాలంలో నిధులు రావడం లేదని, మూడు నెలలకోసారి వస్తున్నాయని తెలిపారు. దీంతో నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

ఇవిగో.. ఉదాహరణలు తాండూరుకు చెందిన యువకుడు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ఫ్)లో సీసీగా ఉద్యోగం చేస్తూ మద్యానికి అలవాటుపడ్డాడు. సంవత్సరాలు గడిచినా వ్యసనాన్ని మానుకోలేదు. విసుగు చెందిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడుకు బానిసై ఉద్యోగానికి వాలంటరీ రాజీనామా చేశాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబాన్ని, చక్కటి జీవితాన్ని మద్యం మహమ్మారి హరించేసింది.

పట్టణానికి ఆనుకొని ఉన్న గ్రామంలో ఓ యువకుడు వ్యవసాయంతోపాటు మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఫలితంగా కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఇటీవల మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదిహేను సంవత్సరాల్లోపు పిల్లలు తండ్రిని కోల్పోవాల్సి వచ్చింది. వారి పోషణ తల్లి భుజాల మీద పడింది.

తాండూరు పరిధిలో ఇటీవల హమాలీ పనిచేసే ఇద్దరు తాగి మత్తులో పడిపోయారు. వారిలో ఒకడికి ముందుగా తెలివి వచ్చింది. వెంటనే తోటి కూలీ ఫోన్, డబ్బులు కాజేసి వికారాబాద్‌లో రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని దుర్మరణం చెందాడు.

# పుస్తకాలే లేవు.. అప్పుడే పరీక్షలు.. ఫీజులు



హైదరాబాద్ : దూరవిద్యా విధానంలో అర్హులైన వారికి డిగ్రీ, పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రొఫెసర్ రాంరెడ్డి దూరవిద్య కేంద్రం విద్యార్థులకు బోధన అందించడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. గతేడాది ప్రారంభమైన సెమిస్టర్ విధానంలో పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఇంకా పుస్తకాలు, స్టడీమెటీరియల్ పూర్తిగా అందకముందే పరీక్షలు నిర్వహిస్తామంటూ తేదీలు ప్రకటించింది. ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను హెచ్చరించింది. ఇంతేకాదు.. కళాశాలల్లో చదివే విద్యార్థులకు బోధన తరహాలో క్లాసులకు హాజరు కావాలంటూ తాఖీదులు జారీచేసింది. సెలవురోజుల్లో, ఆదివారాల్లో తరగతులుంటాయని చేరితే వర్సిటీలు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థుల్లా ఎలా వెళ్తామని దూరవిద్య విభాగం విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వేర్వేరు సంస్థలు, కార్యాలయాల్లో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్నామని, దూరవిద్య కేంద్రం ఆచార్యులు చెప్పినట్లు నడుచుకోవాలంటే తీవ్ర ఇబ్బందులుంటాయంటున్నారు.

సెమిస్టర్ విధానం.. నత్తనడకన తరగతులు

దూరవిద్య కేంద్రంలో గతేడాది జూన్‌లో సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పీజీ కోర్సుల్లో చేరిన వారికి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటికీ మొదటి సెమిస్టర్ పూర్తికాలేదు. రెండో సెమిస్టర్ క్లాసులూ మొదలు కాలేదు. దీంతో విద్యాసంవత్సరం పూర్తవుతోందంటూ వేగంగా సెమిస్టర్ క్లాసులు పూర్తి చేస్తున్నారు. క్లాసులు పూర్తి కాకుండానే మొదటి సెమిస్టర్ పరీక్షలు జులై నెలలో ఉంటాయని, పరీక్ష ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులకు చెబుతున్నారు. యూజీసీ నిబంధనల మేరకు ప్రతి సెమిస్టర్‌కు మూల్యాంకనం తయారు చేసి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందిస్తామన్న హామీతోనే ప్రవేశాలు నిర్వహించాలి. ఇందుకు భిన్నంగా దూరవిద్య కేంద్రం అధికారులు వ్యవహరించారు.

అరకొరగా పుస్తకాల సరఫరా..

పీజీస్థాయిలో ప్రతి కోర్సుకు 16 సబ్జెక్టులుండగా సెమిస్టర్ ప్రారంభమై ఏడాది పూర్తవుతున్నా రెండు, మూడు పుస్తకాలు మాత్రమే ఇచ్చారు. వాటితో జులైలో జరుగనున్న పరీక్షలు ఎలా రాస్తారో అధికారులకే తెలియాలి. సైకాలజీ సబ్జెక్టు చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకూ ఒక్క పుస్తకం కూడా అందలేదట. ఈనెల 18-28 వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జులై 5లోపు రూ.1720 ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుం రూ.500తో వచ్చేనెల 12 లోపు కట్టాలంటూ అధికారులు ప్రకటించారు. విద్యార్థుల ఇబ్బందులను జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ డీబీ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామని, పరీక్షల ఫీజు చెల్లించమంటూ ముందుగా ప్రకటన ఇవ్వడం సాధారణమేనని వివరించారు.

# ఆగని మృత్యుఘోష



వేములవాడ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో కోడె మొక్కులకు ప్రసిద్ధి. స్వామివారిని దర్శించుకునే భక్తులు కోరిన కోర్కెలు తీరిన తరవాత కోడె మొక్కులు చెల్లించుకుంటారు. మరికొందరు ఇంటి వద్ద, లేదా ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి స్వామివారికి నిజ కోడె రూపంలో సమర్పిస్తారు. అలాంటి వాటిని తిప్పాపూర్ గోశాలలో ఆలయ అధికారులు సంరక్షిస్తుంటారు. ఇందులో ఇటీవల తరచూ కోడెలు మృత్యువాత పడటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. బుధవారం గోశాలలో రెండు కోడెలు మృతి చెందగా, మరో పది కోడెల వరకు మృత్యువుతో పోరాడుతున్నాయి. రాజన్న గోశాల నుంచి రాష్ట్రంలోని వివిధ గోశాలలకు తెలంగాణ గోశాల ఫెడరేషన్ ద్వారా అనుమతులు పొంది వివిధ గోశాలలకు ఆలయ అధికారులు కోడెలను అందజేసేవారు. గోశాలలకు పంపిణీ చేస్తున్న కోడెలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలతో ఇతర గోశాలలకు ఈ ఏడాది జనవరి నుంచి పంపిణీని నిలిపివేశారు. గోశాలలో దాదాపు 300 వరకు ఉండే కోడెల సంఖ్య ప్రస్తుతం 2 వేలకు పైగా పెరిగింది. దీంతో వీటి సంరక్షణ భారంగా మారింది. షెడ్లు, ఆవరణ సరిపోవడం లేదు. చాలా వరకు తోసుకోవడంతో బక్క చిక్కినవి కిందపడి గాయాల పాలవ్వడం, అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. వాటి పోషణకు ఎండుగడ్డి, పచ్చిమేత, ప్రొటీన్ ఫుడ్ అందిస్తున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. తాగునీటి వసతి, ఎండ వేడిమి తగలకుండా ఫాగర్స్, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఓ పశువైద్యుడు, తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా కోడెల మృత్యువాత ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రణాళిక అమలుతోనే ప్రయోజనం

గోశాలలో పూర్తిస్థాయిలో అధునాతన షెడ్లు, వసతులు, సిబ్బంది, కోడెలకు పౌష్టికాహారం వంటి వాటితో పాటు పశువైద్యుల పర్యవేక్షణతోనే కొంత వరకు కోడెల మృతిని అరికట్టడానికి అవకాశం ఉంటుంది. గోశాలలో కోడెల సంఖ్య పెరిగిన కొద్దీ వసతులు మెరుగుపరచాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో కోడెలకు శాపంగా మారింది. దీంతో అవి అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నాయి. ఇటీవల వర్షాలకు వానలో తడిసి, ఎండలో ఎండాయి. గోశాల ఆవరణ మొత్తం బురద మయం కావడంతో అందులో తిరిగాయి. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆలయ ఈవో రామకృష్ణ, అధికారులు రెండు గోశాలలను పరిశీలించి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ముందుగా బురదను తొలగించి మొరం పోసే కార్యక్రమం మొదలు పెట్టారు. నూతన షెడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, ఆవరణలో సీసీ నిర్మాణం తదితర వసతులు ఏర్పాటు చేయాలనే ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఇవి పూర్తయితే కోడెలకు కొంత వరకు ప్రయోజనం చేకూరనుందని భావిస్తున్నారు.

సంరక్షణకు చర్యలుకోడెల సంరక్షణకు పూర్తి స్థాయిలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కంటే మృతి చెందిన కోడెల సంఖ్య తక్కువగా ఉంటున్నాయి. స్వామివారికి భక్తులు పాలు మరవని, అనారోగ్యంతో ఉన్న వాటిని సమర్పించడంతో సమస్య ఏర్పడుతుంది. వాటి సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొన్ని చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది.శ్రీనివాస్, ఏఈవో, రాజన్న ఆలయం

# మున్సిపాలిటీ పార్కులో బహుళ అంతస్తుల భవనం!

హైదరాబాద్ : తప్పుడు సర్వే నంబర్లు.. నకిలీ వ్యక్తుల హాజరు.. పక్కాగా దస్తావేజులు.. హెచ్ఎండీఏ అనుమతులతో కొందరు కబ్జాదారులు దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన పార్కు స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు. వాటికి ఆస్తి పన్నూ చెల్లిస్తున్నారు. హెచ్ఎండీఏ అనుమతులంటే పక్కాగా ఉంటాయనుకున్న మున్సిపల్ అధికారులకు కొద్దిరోజుల క్రితం స్థానికుల ఫిర్యాదుతో బహుళ అంతస్తుల భవనంతోపాటు 54 ఎకరాల లే-అవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన మూడెకరా ఉన్నాయని తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు. బహుళ అంతస్తుల భవనం యజమానులకు తాఖీదులతో సరిపెట్టారు. ఉద్యానం కోసం కేటాయించిన భూమిలోనే నిర్మించారా?.. పట్టా భూమిలో నిర్మించారా?.. అన్న అనుమానం ఉండడంతో తాఖీదులతో సరిపెట్టామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. అనుమానం ఉన్నప్పుడు రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులను సంప్రదిస్తే తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. పార్కుల భూమి విలువ రూ.90 కోట్లు ఉంటుందని స్థానికులు తెలిపారు.

తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. దుండిగల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు కబ్జాదారులకు కేవీఆర్ లేఅవుట్‌లో పార్కుల భూములున్నాయని గుర్తించారు. ప్రైవేటు పట్టాభూముల సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి ఆరేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తరువాత అప్పటి దుండిగల్ పంచాయతీలో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు లేకపోవడంతో హెచ్ఎండీఏకు దరఖాస్తులు



సమర్పించి అనుమతులు తెచ్చుకున్నారు. వేగంగా బహుళ అంతస్తులు నిర్మించారు.డిజిటల్ సర్వే చేస్తే వాస్తవాలు వెలుగులోకి..

పార్కు స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణం నిగ్గు తేలాలంటే డిజిటల్ సర్వే నిర్వహించాలి. రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లు, తాజా సర్వే నంబర్లను పోల్చడంతోపాటు ఆక్రమణల గుట్టు తేలే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఇరవై ఏళ్ల క్రితం మల్లంపేట పరిధిలో ఇరవై ఏళ్ల క్రితం ఓ వ్యక్తి లే-అవుట్ వేశారు. ప్రజావసరాలు, ఉద్యానాల కోసం మూడెకరాల భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఐదేళ్ల క్రితం దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో ఆ భూములు మున్సిపాలిటీ పరమయ్యాయి. అయితే ఇప్పటికీ వాటిని పరిశీలించి సరిహద్దులు ఏర్పాటు చేయలేదు.

# పాన్ కార్డుతో బీమాకు ధీమా

కరీంనగర్ : ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణిస్తే ప్రభుత్వం అందించే బీమా పరిహారం పొందేందుకు ప్రభుత్వం కొత్త విధానం ప్రవేశపెట్టింది. మృతి చెందిన వారితోపాటు పరిహారం పొందే అర్హులైన కుటుంబ సభ్యులకు పాన్ కార్డు తప్పనిసరి ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వివరాలు సమర్పించేందుకు జూన్ 30వ తేదీని చివరి గడువుగా విధించారు. పరిహారం పొందేందుకు బీమా పరిధిలోకి చేరే సభ్యులకు ప్రభుత్వం పలు అంశాలతో కూడిన విధానం అమలు చేస్తోంది. ఈ విషయం వివరాల సేకరణ కోసం మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని మత్స్యకారుల సహకార సంఘాలకు వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి..

గతంలో పాన్‌కార్డు లేకున్నా పరిహారం అందించే వారు. ప్రస్తుతం కొత్త విధానం ప్రకారం పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, వయస్సు, పుట్టిన తేదీ, గ్రామం, మండలం, జిల్లా వివరాలు, మత్స్యకారుడి ఆధార్‌కార్డు, బీమాలో చేర్చిన నామిని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, చరవాణి నంబర్, తదితర వివరాలు తప్పనిసరి. వీటన్నింటినీ ప్రభుత్వం సూచించిన సైట్‌లో తప్పనిసరి నమోదు చేసుకోవాలి. ఈ కార్యక్రమం ఇప్పటికే జిల్లాలో కొనసాగుతోంది. ప్రధానమంత్రి మత్స్య బీమా యోజనతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సీఎం మత్స్యయోజన అమలవతోంది. కొత్త విధానంలో నిబంధనలు పాటిస్తేనే పరిహారం అందనుంది.

మత్స్యకారుల బీమా యోజన..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులుగా ఉండి చేపలు పట్టి జీవించే మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇప్పటి వరకు సభ్యుడి పేరున బీమా ఉంటే వారి కుటుంబంలో అర్హులైన వారికి బీమా పరిహారం చెల్లించే వారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి బీమా యోజన పథకం అమలు చేస్తోంది. సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి ఇది వర్తిస్తుంది. బీమా ప్రీమియాన్ని సభ్యుల పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ఈ పథకంలో అర్హులైన సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.2.5 లక్షలు, ప్రమాదంలో గాయపడితే రూ.25 వేలు ఇచ్చే విధానంలో బీమా పరిహారం రూపొందించారు.

కొత్త చిక్కులు!

పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ వివరాలు వంటివి మత్స్యకారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. చాలా మంది పాన్ కార్డులు పొందలేదు. దరఖాస్తుపై సంతకం చేయాల్సి ఉండగా.. కొద్దిమంది నిరక్షరాస్యులకు ఇది తలనొప్పిగా తయారైందని చెబుతున్నారు. నిబంధనలు కూడా కఠినంగా ఉన్నాయని వాపోతున్నారు. కొన్ని సడలించడంతోపాటు గడువు పెంచాలని సభ్యులు కోరుతున్నారు.

60 శాతం పూర్తి విజయభారతి, సహాయ సంచాలకులు, మత్స్యశాఖ జిల్లాలో బీమాకు సంబంధించి 60 శాతం సభ్యుల వివరాలు నమోదు చేశాం. ముందుగా సభ్యులందరి పేర్లు, వివరాలు పంపాలని కోరాం. పాన్ కార్డులు కూడా తీసుకోవాలని చెబుతున్నాం. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

జిల్లాలో ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సంఖ్య : 189
సభ్యుల సంఖ్య : 14,989
చెరువులు : 809రిజర్వాయర్ : 1పెద్ద చెరువులు : 85రూ.అయిదు లక్షల బీమా పొందిన వారి సంఖ్య : 6
ఇంకా రావాల్సినవి : 38





# హెరిటేజ్ సిటీగా వరంగల్ : సీఎం రేవంత్‌రెడ్డి

హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్షిస్తున్నారు. నగరాభివృద్ధికి సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ప్రతీ 20రోజులకోసారి సమీక్ష నిర్వహించాలన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌పై సైతం సమీక్షిస్తున్నారు. సీఎస్‌తో పాటు డీజీపీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని చెప్పారు.

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్క్‌కు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నాలాలు ఆక్రమణలకు గురవకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ : కేటీఆర్



హైదరాబాద్ : చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోవారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు కేటీఆర్. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సాయిచంద్ మరణించి ఏడాది అవుతుందంటే ఎవరం నమ్మలేకపోతున్నాం. తన మాటతో, పాటతో అద్భుతమైన వాగ్దాటితో తెలంగాణ ప్రజలను ఉర్రూతలూగించిన అద్భుత కళాకారుడు సాయిచంద్. మన అందరి ఆప్తుడు.. చిరకాలం మా గుండెల్లో నిలిచపోయే తమ్ముడు. భవిష్యత్‌లో సాయి కుటుంబం కోసం ఎల్లవేళలా పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆనాటి నుంచి నేటి వరకు ఎలా అండగా ఉన్నామో భవిష్యత్‌లో కూడా ఉంటాం. సాయి జ్ఞాపకార్థం పాటల సీడీలు, సంకలనాలు, పుస్తకాలు తీసుకొచ్చిన సోదరులకు అభినందనలు.

తమ్ముడి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని కోరుకుంటూ కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# మాజీ మంత్రి డీఎస్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ : మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2004, 2009లో మంత్రిగా సేవలందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అంతా ఆయనను డీఎస్ అని పిలిచేవారు.



ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు. సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు. డీఎస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

# తెలంగాణలో మరో నాలుగు రోజులు వానలు..!

తెలంగాణలో మరో నాలుగురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదివారం నుంచి బుధవారం వరకు బలమైన, స్థిరమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. వాయువ్య, పశ్చిమ మంధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృమైన ఆవర్తనం ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరం వద్ద వాయువ్య బంగాళాఖతంలో అల్పపీడనం ఏర్పడిందని.. ఇది సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

# డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా

హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. తెల్లవారు జామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు జరపనున్నది. అయితే కాంగ్రెస్ సంప్రదాయం ప్రకారం పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ పార్థివ దేహంపై పార్టీ కండువా, జెండా కప్పి కాంగ్రెస్ నేతలు గౌరవించారు. డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పగానే డీఎస్ చివరి కోరిక తీరిందని ఆయన స్నేహితులు చెబుతున్నారు. డీఎస్‌కు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ నివాళి అర్పించారు. డీఎస్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. డీఎస్ కుమారులు సంజయ్, అరవింద్‌లను పరామర్శించారు.

# డీఎస్ అంత్యక్రియలకు సీఎం రేవంత్

హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్.. తెల్లవారు జామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. అయితే కాంగ్రెస్ సంప్రదాయం ప్రకారం పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ పార్థీవదేహంపై పార్టీ కండువా, జెండా కప్పి కాంగ్రెస్ నేతలు గౌరవించారు. డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పగానే డీఎస్ చివరి కోరిక తీరిందని ఆయన స్నేహితులు చెబుతున్నారు. కాగా.. డీఎస్‌కు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.


రేపు (ఆదివారం) నిజామాబాద్‌లో డీ శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నిజామాబాద్ బైపాస్ రోడ్డులోని సొంత స్థలంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు డీఎస్ పెద్ద కుమారుడు,



నిజామాబాద్ మాజీ మేయర్ సంజయ్ తెలిపారు.అయితే రేపు డీఎస్ అంత్యక్రియల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. రేపు నిజామాబాద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ వెళ్లనున్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

ఆదిలాబాద్, జూన్ 29: బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆయన మరణించారు. శుక్రవారం రాత్రి రమేష్ రాథోడ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ని తరలించారు. అయితే శనివారం ఉదయం మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆ క్రమంలో ఆయన మృతి చెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గానే కాకుండా లోక్‌సభ సభ్యుడిగా రమేష్ రాథోడ్ పని చేశారు. తెలుగుదేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రమేశ్ రాథోడ్ కీలక నేతగా పని చేశారు. ఆయన స్వస్థలం నార్నూర్ మండలం తాడిహాత్నూర్.



# డి. శ్రీనివాస్ మృతి పట్ల ప్రముఖుల సంతాపం



అమరావతి: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డి. శ్రీనివాస్ మంత్రిగా, ఎంపీగా తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసేవారని....తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. డి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు.

# గ్రేటర్ ఆస్తుల పరిరక్షణపై సర్కార్ ఫోకస్..

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా ఏరియాల్లో కోట్ల విలువైన భూములపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. ఇటీవలే మియాపూర్‌లో రాత్రికి రాత్రే టెంట్లు వేసి ఆక్రమించడానికి ప్రయత్నించారు. అడ్డుకోవడానికి వచ్చిన పోలీసులపై దాడులకు తెగబడ్డారు. ఇదే కాకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సీఎం రేవంత్ సర్కార్ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కమిషనర్ అసెట్స్ ప్రొటక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ పేరుతో ప్రత్యేకంగా విభాగాన్ని ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు ఉన్న EVDM ను అసెట్స్ ప్రొటక్షన్ లో విలీనం చేయనున్నారు. GHMC, HMDA పరిధికి ఈవీడీఎంను విస్తరించనున్నారు. ఆస్తుల రక్షణ కోసం ముగ్గురు ఎస్పీ స్థాయి అధికారులు, 8 మంది డీఎస్పీలు, సీఐలు, డిప్యూటీ కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ వాటర్ బోర్డు, ఫైర్ అధికారులను ప్రభుత్వం కేటాయించనుంది. మొత్తం మూడు వేల మంది సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేయనున్నారు.




# బెయిల్ పై వచ్చాక తిరుపతిలో కనిపించిన హేమ, షాకింగ్ సమాధానం

బెంగుళూరు శివార్లలో జరిగిన రేవ్ పార్టీకి సినీ నటి హేమ హాజరైన సంగతి తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆ పార్టీ జరుగుతున్న ఫార్మ్ హౌస్ కి ఆకస్మిక తనికీ చేసి చాలామందికి టెస్టులు చేసిన సంగతి కూడా అందరికీ తెలిసిన విషయమే. అందులో తెలుగు సినిమా నటి హేమ కూడా వున్నారు, ఆమెని కూడా టెస్ట్ చేసినప్పుడు పాజిటివ్ అని వచ్చింది. తరువాత బెంగుళూరు పోలీసులు హేమని విచారణకు హాజరు కావాలని కోరగా, హేమ కొంచెం సమయం కావాలని చెప్పడం, ఆ తరువాత హేమని అరెస్టు చేసిన విషయం కూడా అందరికీ తెలిసిన విషయమే. కొన్ని రోజులు జైలు జీవితం గడిపిన హేమ తరువాత బెయిల్ పై విడుదలయ్యారు. నిన్న అందరినీ ఆశ్చర్యపరుస్తూ తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన తరువాత బయట ఎదురుచూస్తున్న పాత్రికేయులతో మాట్లాడారు. అయితే పాత్రికేయులు అడిగిన ప్రశ్నకి హేమ షాకింగ్ సమాధానం చెప్పారు. హేమ గుడి నుండి బయటకి వచ్చిన తరువాత అక్కడ చాలామంది హేమతో ఫోటోలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. అందరికీ సెల్ఫీలు ఇచ్చిన హేమ తరువాత పాత్రికేయులతో మాట్లాడారు. తిరుపతి తను చిన్నప్పటి నుండి వస్తున్నాను అని, అందుకని ఇది తనకి పుట్టిల్లు లాంటిదని చెప్పారు హేమ. "దర్శనం చాలా బాగా జరిగింది. చాలా సంతోషంగా వుంది, చాలాసేపు గుడిలో కూర్చొని వస్తున్నాను. చిన్నప్పటి నుంచి ఇక్కడికి వస్తున్నాను. ఇది నా పుట్టిల్లు అని మీ అందరికీ తెలుసు," అని చెప్పారు హేమ ఎదురుచూస్తున్న పాత్రికేయులతో. బెయిల్ పై బయటకి వచ్చారు కదా, ఆ కేసు గురించిన వివరాలు ఏమైనా చెప్తారా అని అడిగినప్పుడు, "మీకే తెలియాలి, మీరే రాస్తున్నారుగా న్యూస్", అంటూ సమాధానం చెప్పి హేమ వెళ్లిపోయారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660